
గొలుసుకథ

# నీలాంటి ఒకరు...

నందం రామారావు



(మూడవ భాగం)

గౌరీపతి, కిటికీలోంచి బయటకు చూశాడు.

స్టేషనూ, డేవిడ్‌తోపాటు జనం క్రమంగా దూరమవ సాగారు. ఆ కొద్దిపాటి వెల్తుర్లో అంతా చిన్న పురుగుల్లా కను పించారు.

అవును! డేవిడ్ ఒక చిన్న పురుగు. అతన్ని తలచుకుంటే జాలేస్తోంది!

గౌరీపతి వొచ్చి సీట్లో కూర్చున్నాడు. అతని కెదురుగా నడివయసు దాటిన భార్యా భర్తలు కూర్చున్నారు. వాళ్ళు చాలా సంతోషంగానూ, చూడ ముచ్చటగానూ వున్నారు.

మేరీ డేవిడ్‌ను చాలా హీనంగా చూస్తోం దన్నది నిజం! అతన్నొక భర్తగా కాకుండా సేవకుడిగా ట్రీట్ చేస్తోంది. ఈ నరకాన్ని ఏ మగవాడునూ భరించలేడు! నిజం ఇది. డేవిడ్ భార్యను అమితంగా ప్రేమించాడు. ఆమె చిరునవ్వు కోసం, మంచిమాట కోసం పరితపించే మనిషతను.

రైలు కదలబోయేముందు డేవిడ్ అన్న మాటలు మళ్ళీ గుర్తుకొచ్చాయ్!

పరాయివాడు తన భార్యతో చనువుగా ప్రవర్తిస్తే సహించలేడు! మేరీ ప్రవర్తన డేవిడ్‌కు తెలీక కాదు. ఆమె నడవడిలో మార్పువచ్చి తన్ను భర్తగా ఆదరిస్తుందని గుండెల్లో ఆశ పెంచుకున్నాడు. చాలా అందమైన రంగు రంగుల కలలు గన్నాడు. మధ్యలో తన రాకతో— అవన్నీ కోపంలో, కన్నీళ్ళలో కరిగిపోయాయి!

మనిషి సహనానికీ, ప్రవర్తనకూ వొక హద్దంటూ వుండాలి. వాటిని దాటితే తిరుగుబాటు తప్పదు. డేవిడ్ ఈవిధమైన వేదనని భరించలేకపోయాడు.

అందుకే—

వెళ్ళిపోయేటప్పుడు ఆమాటలన్నాడు డేవిడ్! అప్పుడు గౌరీపతికి అంతులేని అభిమానం కలిగింది డేవిడ్‌మీద.

రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

గౌరీపతి దిగి ప్లాట్‌ఫారంమీద కెళ్ళి సిగరెట్ ప్యాకెట్ తెచ్చుకున్నాడు. అటూ యిటూ తిరిగాడు. ఐదునిముషాల్లో భర్త భార్యను ఆనుకుని కునికిపాట్లుపడుతున్నాడు. ఆయనకు చలిగాలి తగలకుండా, ఆమె శాలువా కప్పి—

'ఫ్లాస్కులో కాఫీ వుంది. తాగుతారా?' అంది ఆప్యాయంగా.

'ఇప్పుడు తాగను' అన్నాడు.

ఇది చూసి గౌరీపతి సర్దుకూర్చుని హాయిగా గాలి పీల్చుకున్నాడు. సిగరెట్టు కాల్చు కుంటూ కళ్ళు మూసుకున్నాడు. అతని కెదురుగా మేరీ డేవిడ్ కనిపించారు. వాళ్ళి ద్దరి మనస్తత్వాలూ—వికృతంగా తారట్లా డాయి. వాళ్ళిద్దరికీ యిక సరిపడదు. పొత్తు కుదరదు.

వాళ్ళిద్దరి జీవితాలూ— 'నిరాదరణ' అనే కథావస్తువు.

ఈ కథలో—

మేరీ అనే ఆడకూతురు యువరాణి. ఆయువరాణి పువ్వులో పుట్టింది. ఆ లత— అందంగా, హుందాగా, గర్వంగా పెరిగింది. తోడు వెదుక్కుంది. కార్లలో తృళ్ళిపడి తిరిగింది. వెనుకచూపు లేదు. అంతా ముందు చూపే.

ప్రేమించినవాణ్ని పెళ్ళి చేసుకోలేక,

తండ్రి మాటమీద మరో అనామకుడ్ని (భార్యమాట దాటనివాడ్ని, ఇల్లరికంవుండే వాడ్ని) చేసుకుంది. డబ్బుకు ఆశించని వాడుండడు.

ఆవలలో చిక్కుకుపోయి దారి కనుపించక చీకటిని చూడలేక బల్లిలా అంటుకు పోయాడు డేవిడ్! పూర్ ఫెలో! ఆత్మనూ అభిమానాన్ని చంపుకుని మేరీ అనే భార్య చేస్తున్న చేష్టల్ని ఖండించలేక సతమత మవుతున్నాడు.

తాను కోరుకున్నది తీరలేదనే కసికొద్దీ, అందమైన బ్రతుకులో ఏదో సాధించాలనే పగ కొద్దీ చీకటిని కొని తెచ్చుకుంటోంది మేరీ!

డేవిడ్ ఇవన్నీ సహించాడు!

చివరకు—

అతని కళ్లెదుటే ప్రేమించిన వాడ్ని రప్పించి అతనో సంచరించిన భర్తను అవమానించింది. నిర్లక్ష్యమూ చేసింది. మనసు విరగడానికింతకంటే ఏం కావాలి?

అదే భర్త మరో ఆడదానితో తిరిగితే భార్య సహించలేదు! ఈ ఆలోచనలు రాగానే గౌరీపతి ఉలిక్కి పడ్డాడు. అతని ఊహల్లో శారద నిండుగా కనుపించింది.

గౌరీపతి సరిగా కూర్చుని కంపార్ట్మెంటంతా చూశాడు. అతని కెదురుగా కూర్చున్న ఆ దంపతులు ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

రైలు శబ్దం, కూత తప్ప ఆ రాత్రిలో ఇంకేమీ వినిపించడం లేదు. తన మనస్సు రైలు శబ్దంలాటి ఆవేదన్ని సూచిస్తోంది.

శారదను తను ఎప్పుడూ భార్యగా చూడలేదు. కనీసం ఆప్యాయంగా మాట్లాడి కూడా ఎరగడు! శారదని మానసికంగా కృంగదీశాడు. విందుగా నవ్వుకోవడం, మనసులు విప్పి మాట్లాడుకోవడం ప్రతి భార్య భర్తనుంచి ఆశిస్తుంది. వాటి నన్నిటినుంచీ శారదను దూరం చేశాడు.

ఎన్ని మాటలన్నా ఓర్పుతో సహించి పెదవుల మీద చిరునవ్వు కురుపిస్తూ వుండేది. ఒకవేళ, శారద ఎదురు తిరిగి సమాధానం చెబితే తన మగతనం ఏం కావాలి?

గౌరీపతి చేతిగుడ్డతో ముఖం తుడుచు కున్నాడు. కిటికీలోంచి బయటకు తొంగి చూశాడు. అంతా చీకటి. ఆ చీకటిని చీల్చుకుంటూ రైలు పరుగెడుతోంది. తనింత కాలం గుండె కార్నర్‌లో చీకటినే పెంచుకున్నాడు. అదీరోజుతో అంతమవు తుంది. ఆ స్థానంలో శారద వెన్నెల కురి పిస్తున్నట్లుగా జీవితాంతం నవ్వుతూ వుంటుంది. తనకంతకంటే ఇంకేం అక్కర్లేదు!

మేరీ డేవిడ్‌ల బ్రతుకే 'నిరాదరణ' అను కున్నాడు. ఒక విధంగా తమ జీవితాలు కూడా 'నిరాదరణ' లాటివే. అక్కడ మేరీ! ఇక్కడ తనూ!! ఆ నిరాదరణ ఈ రోజుతో ఆదరణగా మారిపోతుంది.

గౌరీపతి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. తన కెదురుగా నిద్రపోతున్న ఆ దంపతుల్ని చూసి—

'ఈబంధం ఇలాగే వుండిపోవాల'ను కున్నాడు.

ఈ క్షణంలో గౌరీపతి మనసూ, శరీరం యావత్తూనూ శారద ముందు వాలాలని వుంది.

* * *

గౌరపతి స్టేషన్లో దిగాడు.

రిక్షాకూడా బేరం ఆడకుండా అడ్రస్ ఇచ్చి వేగంగా పోనిమ్మన్నాడు. అతని హృదయమంతా శారదమీది ప్రేమతో నిండిపోయింది. రిక్షాలోంచి దిగి వాడికో రూపాయిచ్చి గబగబా లోపలకెళ్లాడు.

శారద సోఫాలో కూర్చుని పుస్తకం చదువుకుంటోంది. బూట్లశబ్దం విని తలెత్తి చూసి లేచి నుంచుని—

'ఇదేనా రావడం?' అంది.

గౌరీపతి నవ్వుతూ భార్యకేసి వింతగా చూడసాగాడు.

'రాత్రల్లా నిద్రలేదనుకుంటాను. స్నానా నికి నీళ్లతోడతాను. కాఫీ పెడతాను. అంతా క్షణంలో జరుగుతుంది' అని లోపలి కెళ్ల బోయింది.

గౌరీపతి రెండడుగులు ముందుకువేసి—

'శారదా' అన్నాడు ఆప్యాయంగా.

ఆ పిలుపుకు శారద పరవశించిపోయింది.

'శారదా! అప్పుడే తొందరలేదు ఇవేళ నేను కాలేజీకి వెళ్లను మాట్లాడుకుంటూ కూర్చుందాం. రా శారదా' అని సోఫాలో కూర్చున్నాడు.

భర్త ప్రవర్తనకు శారద ఆశ్చర్యపోయి అతని ముఖంలోకి చూసి తలొంచుకుని వచ్చి ప్రక్కన కూర్చుంది.

గౌరీపతి, శారద భుజంమీద చెయ్యి వేసి—

'సినిమాకెడదాం' అన్నాడు.

శారదకు ఇదంతా ఒక కలలా అనిపించింది.

'మీరు వెళ్లిన పని సవ్యంగా జరిగిందా? అక్కడ మీకేమీ ఇబ్బంది కలగలేదు గదా?' అంది.

'శారదా! ఈ ప్రయాణంవల్ల నేను బతుకంటే ఏమిటో తెలుసుకున్నాను. ఇంత కాలం ఈ ఇంట్లో వెలుగుని చూడలేక పోయాను. నేను చాలా దారుణంగా ప్రవర్తించాను అందుకు సిగ్గుపడుతున్నాను.'

శారద నిలువెల్లా పరవశించి గౌరీపతి నుంచి తప్పించుకుని లోపలకు పరుగెత్తింది!

ఆ సాయంత్రం—

ఇద్దరూ కలిసి సినిమాకెళ్లి హోటల్లో భోజనంచేసి ఇంటికొచ్చారు.

గౌరీపతి పడుకోబోయేముందు...

'శారదా! నేనంటే నీకెప్పుడూ కోపం, అసహ్యంకలగలేదా?' అన్నాడు.

'ఎందుకు?'

'నిన్ను చాలా హింసించాను. ఎక్కడెక్కడో తిరుగుతూ ఎప్పుడో ఇంటి కొచ్చేవాడ్ని. కోపగించుకుంటూ వుండేవాడ్ని, తిడుతూ కూడా ఉండేవాడ్ని.'

శారద నవ్వి—

'మిమ్మల్నెప్పుడూ ఏమీ అనుకోలేదు. నన్నీ ఇల్లు వదలి పెట్టి వెళ్లమనలేదు. నాకదే ఆనందంగా వుండేది. అలా మీరంటే నా గతేంకాను?' అంది.

'శారదా! ఒక భార్యకు ఎన్నెన్నికోర్కెలు, ఆశలు, ఊహలు వుంటాయో తెల్సుకుంటున్నాను. వాటిని తీర్చడం భర్త ధర్మం. నేనెక్కడికి వెళ్లానో నీకు తెల్సు. అక్కడేం జరిగిందో చెప్పనా?'

'మీ యిష్టం.'

జరిగిందంతా గౌరీపతి చెప్పి—

'శారదా! నీతో అబద్ధం ఆడాలనే ఉద్దేశం నాకు లేదు; కష్టమైనా, సుఖమైనా మనిద్దరమే భరించాల్సి వుంటుంది ఇకనుంచి!' అన్నాడు.

శారద నవ్వుతోంది.

'నిజం శారదా! అలా నవ్వకు. నామీద నమ్మకంలేదా? ఒట్టు శారదా. నేను

ఖర్మా గౌరీపతిని కాను.'

'మీరు మరీ చిన్నపిల్లాడయి పోతున్నారండి' అంది శారద, గౌరీపతి జుట్టు నిమురుతూ.

* * *

శంకర్రావ్ కాంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

'హలో! గుడ్‌మార్నింగ్ శంకర్రావు గారూ!' అన్నాడు గౌరీపతి నవ్వుతూ.

'హలోలో! ఎప్పుడొచ్చారు? ఏమిటి విశేషాలు?' ప్రక్కన సీటు చూపించాడు. మరో కాఫీకి ఆర్డరిచ్చాడు.

'రెండురోజులైంది వచ్చి.'

'రెండురోజులైందా? మరి కనుపించనే లేదు.'

'చాలా బిజీగా వున్నానండి.'

ఇంతలో కాఫీ వచ్చింది. గౌరీపతి అందుకుని సిప్ చేస్తూ—'అనుకోని విధంగా చాలా జరిగాయి శంకర్రావుగారు, మీతో చాలా విషయాలు మాట్లాడాలి' అన్నాడు.

వాళ్ళు మాట్లాడుకుంటూ వుండగా సోమయాజులు నీట్‌గా డ్రస్సయ్ వచ్చి విష్ చేశాడు.

'ఏమిటి గురువుగారూ! ఎక్కడా అయిపు లేదు. మీరు లేకపోతే బొత్తిగా చిన్నబోయింది కంపెనీ' అన్నాడు గౌరీపతిని ఉద్దేశించి.

# నీలాంటి ఒకరు...

గౌరీపతి నవ్వి వూరుకున్నాడు.

శంకర్రావు, సోమయాజులు కేసి చూసి—

'ఫస్ట్వర్ లేదా?' అన్నాడు.

'లేదు. లాస్ట్వర్ మాత్రమే వుంది. మధ్యాహ్నమంతా ఆఫ్!' అన్నాడు.

గౌరీపతి వాచీ చూసుకుని లేచి రెండడుగులు ముందుకు వేశాడు. సోమయాజులు, గౌరీపతి చెయ్యిపుచ్చుకుని ఇవతలకు తీసుకొచ్చి—

'గురూగారూ! రాత్రికి మంచి పండుగ చేద్దాం. మీరు కల్సి చాలా రోజులైంది' అన్నాడు.

'సారీ సోమయాజులూ! నేనికనుంచి తాగదలచుకోలేదు. అలా అంటున్నానని మరోలా అనుకోవద్దు.'


'అదేమిటలా అంటున్నారు?'

'తాగడంలో వున్న సుఖం కంటె మా ఇంట్లో వున్న వెలుగే నాకానందం. మరి మీరంతా ఎందుకిలా...?'

సోమయాజులు నవ్వాడు.

'తర్వాత కలుద్దాం వస్తా' అని గౌరీపతి, శంకర్రావు కూర్చున్న సీటుకేసి నడిచాడు.

'ఏమిటంటున్నాడు సోమయాజులు రమ్మనేనా?'




గౌరీపతి నవ్వి అవునన్నట్లు తలూపాడు. శంకర్రావు గంభీరంగామారి—

'గౌరీపతిగారూ! మీరు తాగడం నేను సహించలేను. సోమయాజులు ఎటువంటివాడో మీకు తెలీదు. అతను చాలా క్రూరమైన మనిషి. సాధించాలనుకున్నది నెరవేరితేగాని పట్టు వదలడు. వొద్దు. అతని స్నేహం మీ కొద్దు' అన్నాడు.

గౌరీపతి విచిత్రంగా చూశాడు.

'అవును గౌరీపతిగారూ! సోమయాజులు నా కెప్పటినుంచో స్నేహితుడు. అతన్ని మార్చాలన్న నా ప్రయత్నాలన్నీ మంటగలిసి పోయాయి. మీరతన్తో తిరగొద్దు.'

'అవును సోమయాజులుగురించి ఎక్కువ మాట్లాడుకోవడం మంచిదికాదు. అతన్ని మర్చిపోదాం.'

'వెరీగుడ్! ఈ మాటొక్కటే చాలు. సాయంత్రం సినిమా కెడదాం?' అన్నాడు.

'సారీ! సాయంత్రం మా ఆవిడతో సినిమా కొస్తానని మాటిచ్చాను. నా కోసం చూస్తూ వుంటుంది.'

'ఇప్పుడు చాలా సంతోషంగా వుంది గౌరీపతిగారు.'

'రేపు మా ఇంటికి రండి ఇన్నాళ్ళో మా శ్రీమతి వంట రుచి చూసే భాగ్యం కలగలేదు మీకు. రేపు ఆ భాగ్యానికి నోచుకోండి' అన్నాడు గౌరీపతి.

* * *

ఆ రాత్రి—

సోమయాజులు ఎన్నడూ తాగనంతగా తాగేశాడు. వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. అతనొక్కడే గదిలో చాపమీద కూర్చుని గోడకు ఆనుకున్నాడు.

అతనికిప్పుడు చాలా ఆందోళనగా వుంది.

గది స్పష్టంగా కనిపిస్తున్నా కళ్ళు తేలిపోతున్నాయి.

జీరోవాట్స్ బల్బు గుండెల్లో అసంతృప్తిలా వుంది.

మెల్లిగా ఏదో ఇంగ్లీషు పాట పాడసాగాడు. లేచాడు. కాళ్ళకింద భూమి కదుస్తున్నట్లుగా వుంది. తలంతా ఆలోచనలతో బరువుగా వుంది. ఆలోచనలచుట్టూ తను తిరుగుతుంటే తనచుట్టూ ప్రపంచం తిరుగుతోంది! టేబుల్‌మీదున్న బాటిల్లోది కొంత గ్లాసులోకి వంపుకుని గడగడా

తాగేశాడు.

[ఈ అందమైన రాత్రి నా కోసం ఉద్దేశింపబడింది. అందుకే సోమయాజులవే ఓ ఫుల్ అతివారుణంగా తాగేశాడు తాగడం ఇలా అలా కాదు. గుండెలు పగిలి చచ్చేట్టు. సోమయాజులంటే అందరికీ దుర్మార్గుడు. నీచుడు. అతనిలో వున్న మరో మనిషిని ఎవరూ చూడలేరు. చూడ్డం ఎవరికీ చేతకాదు. అది వాళ్ళ తరంకాదు.

యస్! దిగులుపడకు సోమయాజులూ. నీ సంగతి నాకు తెలుసు. నువ్వు మంచి వాడివి.]

సోమయాజులు హఠాత్తుగా తలుపులు తీసుకుని బయటకు వచ్చేసి నడవసాగాడు.

అప్పటికి అమావాస్య వెళ్ళి రెండు రోజులు కావడం వల్లనూ, వీధి దీపాలు లేకపోవడం వల్లనూ దారంతా చీకటిగా వుంది.

తలంతా తిరుగుతోంది. కళ్ళ ముందు దారి కనుపించడం లేదు. గతం అతన్ని కలవర పరుస్తోంది. అప్పుడతను బిగ్గరగా నవ్వుకున్నాడు.

[నేను ది గ్రేట్‌వి. సోమయాజులూ! నువ్వు గొప్పవాడివి. గొప్పవాడివే కాదు. మనసుని జయించిన ధీశాలివి. నా జే జే లందుకో.]

సోమయాజులు చాలా దూరం వచ్చేశాడు. ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

# నీలాంటి ఒకరు ...

వున్నట్టుండి అతని కెందుకో గుండెలవిసి పోయేలా యేడ్వాలనిపించింది. అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. కళ్ళు తుడుచుకున్నాడు.

[సోమయాజులూ! నువ్వు పిరికివాడివయ్ పోతున్నావ్. నీ ధైర్యమంతా 'ఉష్ కాకి' అయిపోయింది. బతుకులో నీకేం మిగల్లేదు! నీ బంగారు కలలన్నీ ఎండమావులయ్యాయి. నిజం సోమయాజులూ! వోడి పోయావ్ నువ్వు. ఒప్పుకో]

సోమయాజులు వేదాంతిలా నవ్వాడు. చేతులో ముఖం తుడుచుకున్నాడు. అతని కళ్ళముందు ఏదో అస్పష్టపు నీడ కదిలి చెదిరిపోతోంది. కళ్ళు తిరుగుతున్నాయి. ఒక్కడుగు కూడా యిక ముందుకు వెయ్యలేక పోయాడు. వళ్ళంతా చెమటల్లు పట్టాయి. ఆ నడి రోడ్డుమీద కుప్పలా కూలిపోయాడు సోమయాజులు.

*　　*　　*

రాత్రి రెండుగంటలయింది.

సెంకడ్‌షోకెళ్ళి గౌరీపతి గేటు తీసుకుని లోపలికొస్తుండగా శంకర్రావు అతనింట్లోంచి బయటకొస్తున్నాడు!

అతను మనిషంతా నలిగిపోయి అదుర్దాగా వున్నాడు. గౌరీపతిని చూసి ఖంగారు పడ్డాడు.

'మీ కోసమే వచ్చాను' అన్నాడు.

'ఇప్పుడా? అంతర్జంటా? అయితే లోపలకెడదాం రండి' అన్నాడు గౌరీపతి.

'ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలి!'

'ఏమిటి మీరంటున్నది?'

'అవును గౌరీపతిగారు! ఓ అభాగ్యుడికి ప్రాణ దానం చెయ్యాలి. అది మీచేతిలో వుంది. మీరు నా మిత్రులు. మీరంటే నాకు గౌరవం, అభిమానం వుంది. అందుకే మీతో చెప్పేయ్యాలనుకున్నాను.'

గౌరీపతి అనుమానంగా శంకర్రావు ముఖంలోకి చూశాడు. శంకర్రావు, గౌరీపతి భుజం మీద చెయ్యివేసి — 'నన్నపార్థం చేసుకోవద్దు. నేను మీ శ్రేయోభిలాషిని' అన్నాడు.

ఇద్దరూ లోపలి కెళ్ళి గదిలో కూర్చున్నారు.

కాసేపు ఎవరూ మాట్లాడుకోలేదు!

'చెప్పండి శంకర్రావుగారు' అన్నాడు.

శంకర్రావు తటపటాయించాడు.

అప్పుడు గౌరీపతి నవ్వి— 'ఎందుకలా సంకోచిస్తారు'? అన్నాడు.

'నేను చెప్పబోయేది......'

'ఏదైనా కానివ్వండి, ఆనందంగా వింటాను. చెప్పండి శంకర్రావుగారు.'

'గౌరీపతిగరూ! మీకో కథ చెప్తాను. నాకో ఆప్తమిత్రుడున్నాడు. అతను చదువుకునే రోజుల్లో ఓ అందమైన అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకోవాలను కున్నారు. వాళ్ళ పెద్దవాళ్ళు వప్పుకోక పోవడం వల్ల విడిపోయారు. వేరే పెళ్ళిళ్ళు చేసుకున్నారు......'

'ఈ కథ నాది. ఇది మీకూ తెలుసు. నన్నవమానిద్దామనా మీ ఉద్దేశం?'


'కాదు. ఇటువంటి కథలు చాలా మందకున్నాయ్. నే చెప్పేది పూర్తిగా వినండి. ఆ తర్వాత ఏం చెయ్యాలో మనస్ఫూర్తిగా చెప్పండి.'

'చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు?'

'ప్రేమించినమ్మాయిని పెళ్ళి చేసుకోలేదనే కసికొద్దీ అతను తాగుబోతయ్యాడు. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాడు. తన ప్రేమికురాలి భర్తని పరిచయం చేసుకుని అతన్ని నాశనం చెయ్య ప్రయత్నించాడు.'

'ఎందుకట?'

'కసి. వాళ్ళ సంసారం సుఖంగా వుండడం తనకిష్టం లేదు. అది సహించ



లేదు. ఆమె వల్లనే తను సుఖానికి దూర మయ్యాడు. తనలాగే ఆమెకూ సుఖం లేకుండా చెయ్యాలంటే ఇది మంచి మార్గం. వాళ్ల సంసారం నరకంగా వుంటే తనకానందం. ఇది పగ. ఈ పగ ఎంతో కాలం పని చెయ్యలేదు. ఇప్పుడతను తుదిక్షణాల్లో వున్నాడు. అతనికో కోర్కె వుంది. ఆమెను కడసారిగా, ఆమె భర్తతో చూసి ఆనందించాలనీ, వాళ్లనుంచి క్షమాపణ పొందాలనీనూ ఎదురుచూస్తు న్నాడు. అందుకొ భర్త ఒప్పుకుంటాడం టారా?'

'భార్యను అమితంగా ప్రేమించే వాడయితే ఆమెను తీసుకెళ్లాలి. అది న్యాయం.'

'ఈ మాట మనస్ఫూర్తిగా అంటు న్నారా?'

'అవును.'

'గౌరీపతిగారూ! నన్ను మన్నించండి, ఇది కథ కాదు.'

'మరి......'

'ఇప్పుడు సోమయాజులు చివరిదశలో వున్నాడు. నాలుగు గంటల క్రితం అతను గుండెపోటుతో నడిరోడ్డు మీద స్పృహ తప్పి పడిపోయాడు. స్టూడెంట్స్ చూసి హాస్పిటల్లో అతన్ని ఎడ్మిట్ చేశారు. మీరూ, శారదగారూ వచ్చి అతనికి కనిపిం చండి. ఇదతని చివరి కోర్కె.'

వాళ్ల మాటలు వింటూ శారద కిటి కీలో కూర్చుంది. కిటికీ ఊచల్లోంచి బయటకు చూస్తోంది. ఎక్కడో దూరాన ఓ వెలుగు కనుపిస్తోంది.

గౌరీపతి, శంకర్రావు మొహంలోకి చూసి — 'ఒక్క క్షణం. ఇప్పుడే వస్తాను' అన్నాడు.

గౌరీపతి గుమ్మం దగ్గరకొచ్చి గది లోకి చూశాడు. శారద కదలకుండా అలాగే బయటకు చూస్తోంది.

'శారదా' అన్నాడు.

శారద మాట్లాడలేదు.

గౌరీపతి లోపలికెళ్లి మళ్లీ—

'శారదా' అన్నాడు.

శారద ఇటు తిరిగి భర్తకేసి చూసింది.

ఆమిప్పుడు...నిర్వికల్పంగా, యోగినిలా వుంది!

గబగబా వచ్చి భర్త కాళ్లమీద పడింది.

గౌరీపతి ఆమెను లేవనెత్తి—

'శారదా! నువ్వు చాలా మంచిదానివి. నేను అదృష్టవంతుడ్ని' అన్నాడు.

* * *

'అంతా చెప్పేవా? అతనొప్పుకున్నాడా? నాకు నిజం చెప్పు శంకర్రావ్' అన్నాడు సోమయాజులు భయం భయంగా.

'ఇంకో క్షణంలో వాళ్లిద్దరూ నీ ముందుంటారు—సరా?'

'థేంక్స్ ...ఇంకోమాట చెబుతావా?— నేను బ్రతుకుతానంటున్నాడా డాక్టరు బాబు.'

'మరేం ఫర్లేదు.'

'ఏం జబ్బట? — పోనీ దానిపేరు చెప్పకు. నీకు సుమతీ శతకం కంఠతా వొచ్చుగదూ— బుద్ధిమంతుడెవడు? వాడి గుణగణాలెట్టివి? వివరిస్తావూ? వింటాను—'

'ఇంక అట్టె మాట్లాడకు సోమ యాజులూ. కళ్లు మూసుకుని నిద్రపో...'

'కళ్లు మూసుకోనా? బలేవాడివి. ఆ కళ్లు అలాగే శాశ్వతంగా మూసుకుపోతే నేను శారదనీ, సరస్వతినీ ఎలా చూడ గలను? అన్నట్టు సరస్వతికి వైరిచ్చావ్ గదూ? థేంక్స్,' అన్నాడతను.

అదే క్షణంలో శారదా, గౌరీపతి వొస్తున్న వైనం గమనించిన శంకర్రావ్ సోమయాజులు నోరు మూసి అన్నాడు—

'ఉష్...వాళ్లు వస్తున్నారు!'

'ఎవరు? శారదేనా? అవునా?...'

శంకర్రావ్ తలూపడం చూచి సోమ యాజులు గుమ్మం వేపు దృష్టి విలిపాడు —

శారదా, గౌరీపతి గుమ్మం దగ్గర నిలిశారు.

వాళ్లు ఆది దంపతుల్లా సోమయాజు లుకి కనిపించారు.

వాళ్లు తన ప్రాణదాతల్లా ప్రత్యక్ష మయ్యారనుకున్నాడతను. అందుచేత—మన సులో నిండిన అభిమానానికి చిహ్నంగా—

సోమయాజులు రెండు చేతులూ జోడిం చాడు.

అతని కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి.

అకస్మాత్తుగా తలని పక్కకి వొంచే శాడు సోమయాజులు!

(అయిపోయింది) ●

